ఉప్పొంగిన అభిమానం

- ఘనంగా మాజీ సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు
- వాడవాడలా సేవా కార్యక్రమాలు


రక్తదానం చేస్తున్న చందన నాగేశ్వర్, చిత్రంలో వేణు, జక్కంపూడి రాజా


చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్



గిరజాల బాబు ఆధ్వర్యంలో కూరగాయలతో రూపొందించిన జగన్ చిత్రపటం

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల కేక్ కట్ చేసి, సేవా కార్యక్రమాలు చేపట్టారు. నగరంలోని పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కార్యాలయంలో, సంహిత కన్వెన్షన్ హాల్లో వేడుకలు జరిపారు. అనంతరం జక్కంపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ వినూత్న పథకాలు అమలు చేసి, దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయాల సాధనకు జగన్ రాజకీయాల్లోకి వచ్చారని, పేదవారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అడుగడుగునా కృషి చేశారన్నారు. పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్ అన్నారు. ఈ సందర్భంగా యువజన యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, గ్రీన్ అండ్ క్లీనరీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ నాయకులు ఆరిఫ్, కానుబోయిన సాగర్, నీలి ఆనంద్, గేడి అన్నపూర్ణరాజు, కోడి కోట, నరవ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

పేదల సంక్షేమమే ధ్యేయంగా మాజీ సీఎం జగన్ పాలన సాగించారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో వీఎల్ పురంలోని మార్గాని ఎస్టేట్స్‌లో జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మూగ, చెవిటి పాఠశాల చిన్నారులతో కేక్ కటింగ్ చేయించారు. అనంతరం భరత్‌రామ్ విలేకరులతో మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీనీ నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. అనంతరం వైఎస్సార్ సీపీ క్రికెట్ టోర్నమెంట్‌ను భరత్ రామ్ బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, నాయకులు కానుబోయిన సాగర్, దాసి వెంకట్రావు, మజ్జి అప్పారావు, మార్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- వైఎస్సార్ సీపీ 34వ డివిజన్ ఇన్‌చార్జి పోలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆర్యాపురం రెడ్లపేట సెంటర్‌లో కేక్ కట్ చేశారు. పార్టీ నాయకులు నీలాపు వెంకట కోటారెడ్డి, సప్పా ఆదినారాయణ, సంకిస భవానీ ప్రియ, కాటవరం రాజు పాల్గొన్నారు.

లబ్ధిదారుడి చెంతకే పథకాలు

రాజమహేంద్రవరం రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వాడవాడలా వేడుకలు నిర్వహించి, సేవా కార్యక్రమాలు జరిపారు. బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, జిల్లా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రాధాన్యం

మాజీ సీఎం జగన్ తన పాలనలో మహిళల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇచ్చారని, వారిని లక్షాధికారులను చేశారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. శాటిలైట్‌సిటీలోని పార్టీ కార్యాలయం, వృద్ధాశ్రమం, అనాథాశ్రమాల్లో జగన్ జన్మదిన వేడుకలు జరిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి వేణు చేతుల మీదుగా పేదలకు, వృద్ధులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా అనాథాశ్రమంలో చిన్నారుల మధ్య కేక్ కట్ చేశారు. కాతేరులోని సద్గురు వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, శాటిలైట్‌సిటీ, కాతేరు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో వైఎస్సార్ సీపీ జిల్లా వైద్య విభాగం, జిల్లా ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముందుగా సూర్యదేవాలయంలో పూజలు చేశారు. అనంతరం మహారోగి ఆరోగ్య కేంద్రంలోని రోగులకు డాక్టర్ అనసూరి పద్మలత వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందులతో పాటు దుప్పట్లను పంపిణీ చేశారు. జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ముద్దాల అను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి యెనుముల త్యాగరాజు, పార్టీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ నాగులపల్లి ఆశాలత, నాయకులు పాల్గొన్నారు.
- స్థానిక బాలాజీపేట సెంటర్‌లో గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సూరంపూడి ప్రకాష్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, సిటీ లీగల్ సెల్ అధ్యక్షుడు సుమన్‌పాల్, రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

కడియం మండలంలో..

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. జేగురుపాడులో మండల అధ్యక్షుడు, సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి శివాజీ, పాలపర్తి ప్రకాష్ కుమార్, ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు సాక కిరణ్ కుమార్, మాజీ అధ్యక్షుడు బళ్ల అన్నవరం, నాయకులు పుట్టా బుజ్జి, నాగిరెడ్డి మోహన్, యాదల మహేంద్ర వర్మ, మారిశెట్టి నాగన్న, లచ్చయ్య పాల్గొన్నారు.

కూరగాయలతో జగన్ చిత్రపటం

కడియం: సంక్షేమ ప్రదాత, మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలను కడియంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల కూరగాయలతో జగన్ భారీ చిత్రపటాన్ని రూపొందించారు. జగన్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రదర్శిస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. గిరజాల బాబు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి జగన్ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖంగా ఉన్నారని కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సతీష్ చంద్ర స్టాలిన్, పార్టీ నాయకులు కానుబోయిన సాగర్, తాటికొండ విష్ణుమూర్తి, కొండపల్లి పట్టియ్య, మద్దాల అను, తిరుమల శెట్టి శ్రీనివాస్, డాక్టర్ ఆలీ, ఊటుకూరి శైలజ, సర్కార్ బాషా తదితరులు పాల్గొన్నారు.


వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ అనసూరి పద్మలత


కేక్ కట్ చేస్తున్న పోలు విజయలక్ష్మి తదితరులు


జేగురుపాడులో కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సతీష్‌చంద్ర స్టాలిన్


శాటిలైట్ సిటీలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న వేణు, చందన నాగేశ్వర్

క్లుప్తంగా

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం


డైట్‌లో ఛాత్రోపాధ్యాయులతో ప్రిన్సిపాల్ జయశ్రీ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో శనివారం జాతీయ గణిత దినోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి (డిసెంబరు 22) సందర్భంగా ఈ కార్యక్రమం జరిపారు. డైట్ సీనియర్ లెక్చరర్ కేవీ సూర్యనారాయణ, రామానుజన్ సంఖ్య 1729 లోని అంకెలను ఆంగ్ల అక్షరాలకు అనుసంధానిస్తూ ఏజీబీఐ అనగా ఏజీనియస్ బార్న్ ఇన్ ఇండియా అనే వాక్యాన్ని రాబట్టడం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయుల ప్రదర్శనలు అలరించాయి. ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకుడు ఆర్‌జేడీ రాజు, రాజేష్ పాల్గొన్నారు.

కంటిపూడి పాఠశాలలో..

కంబాలచెరువు: స్థానిక కంటిపూడి రామారావు మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో శనివారం గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి హెచ్‌ఎం పి.దుర్గాప్రసాద్, గణిత నిపుణులు గమిని రంగయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో పనిచేయాలని సిబ్బందికి కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. ఆయన శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాలను పరిశీలించారు. వార్డు సచివాలయ సెక్షన్‌లో సిబ్బందితో మాట్లాడి, అక్కడి రికార్డులను పరిశీలించారు. పథకాల అమలులో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. సెక్రటరీ అబ్దుల్ మాలిక్ అస్ఫర్, సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

కిరీటానికి బంగారం వితరణ


కిరీటం కోసం బంగారాన్ని అందజేస్తున్న వీరభద్రరావు దంపతులు

కడియం: కడియపులంక హరిహర క్షేత్రంలోని వేంకటేశ్వరస్వామికి కిలో బంగారంతో కిరీటం తయారు చేయించేందుకు సంకల్పించినట్లు ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆలయ కమిటీ నిర్ణయం మేరకు దాతల నుంచి బంగారాన్ని స్వీకరిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా కడియపులంక గ్రామానికి చెందిన దాత పెద్దిరెడ్డి వీరభద్రరావు, మంగ దంపతులు 8 గ్రాముల బంగారాన్ని స్వామివారికి సమర్పించారు. గతంలో కూడా పలువురు దాతలు విరాళాలు అందించారని మార్గాని తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం


దుళ్లలో మాట్లాడుతున్న ఎస్సై దుర్గాప్రసాద్

కడియం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్సై దుర్గాప్రసాద్ అన్నారు. సైబర్ నేరాలు, అసాంఘిక కార్యక్రమాల నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం దుళ్ల పంచాయతీ వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత ఇంటర్నెట్ ప్రపంచంలో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయన్నారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, మాజీ సర్పంచ్ చిట్టూరి అమ్మిరాజు, స్థానిక నాయకులు ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ధ్యానంతో మనసుకు ప్రశాంతత

సీటీఆర్ఐ: ధ్యానంతో మనసుకు ప్రశాంతత లభిస్తుందని, తద్వారా అనుకున్న పనులు సక్రమంగా చేయగలమని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీనియర్ టీచర్ శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవంగా డిసెంబర్ 21ని ఐక్యరాజ్యసమితి ప్రకటించిన నేపథ్యంలో మొదటి ధ్యాన దినోత్సవాన్ని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యాన శనివారం రాజమహేంద్రి మహిళా కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ఆనందంగా జీవించడంలో ధ్యానం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎంకేఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఆర్‌సీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 1998–99లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం ఆ పాఠశాలలో కలుసుకున్నారు. దాదాపు 25 ఏళ్ల తర్వాత కలిసిన చిన్ననాటి స్నేహితులందరూ ఆప్యాయంగా పిలుచుకుంటూ సందడి చేశారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు అక్బర్, ఈమని సత్యనారాయణమూర్తి, విజయలక్ష్మి, ప్రభావతి, త్రినాథ్, సూర్యారావు, సాయి, రాజకుమారితో పాటు పాఠశాల కార్యాలయం సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సీహెచ్ ముత్యాలరావు, నాగార్జున, కె.రాజేష్, రవీంద్ర, కేతా రామకృష్ణ, చంద్రశేఖర్‌ను అభినందించారు.

అలరించిన రెడ్ డే వేడుకలు


రెడ్ ఫ్యాషన్ షోలో పాల్గొన్న డ్రీమ్స్ విద్యార్థులు

ధవళేశ్వరం: గ్రామంలోని డ్రీమ్స్ స్కూల్ ఆవరణలో శనివారం రెడ్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. రెడ్ కలర్ ఉపయోగాలు, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విద్యార్థులు వివరించారు. ఆ రంగులోని కూరగాయలు, దుంపల వల్ల కలిగే ఉపయోగాలు వివరిస్తూ, వాటి వేషధారణలో విద్యార్థులు పాల్గొన్నారు. బ్రేక్ ఫాస్ట్, లంచ్‌లలో కేవలం రెడ్ కలర్ కూరగాయల వంటకాలనే తీసుకువచ్చారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు డ్రీమ్స్ విద్యాసంస్థల చైర్మన్ అంగర రమేష్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాళ్లు వి.సంధ్యాకుమారి, జి.విమలా రోజీ, ఎస్.దీపిక, డ్రీమ్స్ ఫస్ట్ స్టెప్ ప్రిన్సిపాల్ కె.లలితాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంగీత నృత్యోత్సవం


దశావతారాల నృత్య రూపకం

స్థానిక ఆనం కళాకేంద్రంలో శనివారం కళాప్రియ నృత్య కళాక్షేత్రం సంగీత నృత్యోత్సవాలు ఘనంగా మొదలయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నగరానికి చెందిన ఎందరో కళాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించారన్నారు. కళాక్షేత్రం నాట్యాచార్యులు ఆచంట చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన పలువురు కళాకారులు పాల్గొంటారన్నారు. ఆంధ్రనాట్యంలో న్యూయార్క్‌కు చెందిన సీతాల శేఖర్ పెళ్లై, నగరానికి చెందిన లోఖా చంద్రశేఖర్ కలిసి చేసిన దశావతారాల నృత్య రూపకం ప్రేక్షకులను అలరించింది.

– సాక్షి, రాజమహేంద్రవరం


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి

నర్సరీల్లో విద్యుత్ తీగల చోరీలు


విద్యుత్ వైర్ల చోరీ జరిగిన నర్సరీని పరిశీలిస్తున్న మల్లు పోలరాజు తదితరులు

కడియం: కడియం ప్రాంత నర్సరీల్లో విద్యుత్ వైర్ల చోరీలు కొనసాగుతున్నాయి. నిత్యం ఏదో ఒక నర్సరీలో ఈ ఘటన జరుగుతుండడంతో రైతులకు కంటిమీద కునుకు ఉండడం లేదు. వీటిని తిరిగి ఏర్పాటు చేసుకోవడానికి ఒక్కో రైతుకు రూ.5 వేలకు పైగా ఖర్చవుతోంది. ఇటీవల కడియం – వెంకాయమ్మపేట రోడ్డులోని దాదాపు 15 మంది నర్సరీ రైతులకు చెందిన వ్యవసాయ మోటార్ల వైర్లను దొంగలు పట్టుకుపోయారు. ఈ నేపథ్యంలో శనివారం నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, పాలక వర్గ సభ్యులు సంబంధిత రైతుల పొలాలను సందర్శించారు. అనంతరం కడియం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నర్సరీల వద్ద రాత్రిపూట గస్తీని పెంచాలని, అనుమానాస్పదంగా సంచరించే వారిని విచారణ చేయాలని కోరారు. అలాగే రైతులు కూడా తమకు అనుమానాస్పదంగా కనిపించినవారి వివరాలను పోలీసులకు తెలియజేయాలని మల్లు పోలరాజు విజ్ఞప్తి చేశారు.

గొల్లపల్లి మాస్టారు సేవలు ప్రశంసనీయం


గొల్లపల్లి మాస్టారును సత్కరిస్తున్న ఎంపీపీ సత్యప్రసాద్ తదితరులు

కడియం: స్థానిక హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గొల్లపల్లి సత్యనారాయణ సేవలు ప్రశంసనీయమని వక్తలు కొనియాడారు. పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం ఆయనను స్కూల్ ఆవరణలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై సత్యనారాయణ సేవలను అభినందించారు. కడియం సర్పంచ్ సత్యవతి, కడియపుసావరం సర్పంచ్ చెక్కపల్లి మురళి తదితరులు మాట్లాడారు. హెచ్‌ఎం టి.సత్యనారాయణ మాట్లాడుతూ గొల్లపల్లి మాస్టారు తన సొంత డబ్బు రూ.75 వేలను విద్యార్థుల కోసం ఖర్చు చేశారని, దాతల నుంచి సుమారు రూ.15 లక్షలను పాఠశాల అభివృద్ధి పనులకు సేకరించారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ అధ్యక్షురాలు గారపాటి సత్య, చిలుకూరు ప్రభ, పల్ల సుబ్రహ్మణ్యం, పూర్వ విద్యార్థులు పాటంశెట్టి సూరిబాబు, ఎడ్ల ప్రసాద్, ఉదయ్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల నిలుపుదలతో ఇబ్బందులు

కడియం: జేగురుపాడు పరిధిలోని సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్లను ఆరు నెలల నుంచి నిలిపివేశారని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. ఈ మేరకు శనివారం జేగురుపాడులో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన పలు సమస్యలను అధికారుల దృష్టికి లిఖితపూర్వకంగా తీసుకువచ్చారు. తరచూ గ్రామంలోని సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్లు జరగకుండా అడ్డంకులు ఏర్పడుతున్నాయన్నారు. గ్రామం మొత్తం ఒకే స్టాంప్ డ్యూటీ లేకపోవడంతో ప్రజల్లో అయోమయం నెలకొంటోందన్నారు. తక్షణం వీటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజల నుంచి రెవెన్యూ సిబ్బంది పలు విన్నపాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, ఉపసర్పంచ్ పాతూరి రాజేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కంబాలచెరువు: వినియోగదారుల చట్టాలపై అందరికీ అవగాహన అవసరమని జిల్లా వినియోగదారుల పరిష్కార కమిషన్ అధ్యక్షుడు జేవీఎస్వీ ప్రసాద్ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సభకు డీసీపీసీ, రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు అధ్యక్షత వహించారు.

ధనుర్మాస నృత్యారాధన


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

ధవళేశ్వరం: గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం వైష్ణవాగమరీతిలో ధనుర్మాస నృత్యారాధన నిర్వహించారు. డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వారందరికీ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. డాక్టర్ సప్పా దుర్గా ప్రసాద్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించారు. అర్చకుడు అనంత వల్లభాచార్యులు, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి నాగ సురేష్, దేవస్థానం చైర్మన్ నీలి కోటేశ్వరరావు, ఆర్యాపురం బ్యాంకు డైరెక్టర్ యర్రమోతు ధర్మరాజు పాల్గొన్నారు.